ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వనభోజనాలకు తరలిన ఆర్యవైశ్య సభ్యులు



అడ్డగుట్ట: తుకారాంగేట్ ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులు ఆదివారం దీపావళి వన భోజనాల యాత్రకు తరలివెళ్లారు. అడ్డగుట్ట నుంచి బస్సులో సుమారు 100 మంది వైశ్య కుటుంబాలు జనగాం జిల్లా చిలిపిరిగుట్టకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మల్లవోలు శ్రీకాంత్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ పోటెత్తేలా కసరత్తులు!

- ఓటర్లను కలుస్తూ అవగాహన కల్పిస్తూ..
- ముమ్మరంగా చీటీల అందజేత
- ఆదివారం నాటికి లక్ష ఫైచిలుకు పంపిణీ
- 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం



ఓటరు స్లిప్పులను అందజేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు రంగంలోకి దిగారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గత రెండు పర్యాయాలు పోలింగ్ శాతం 60 శాతం దాటలేదు.. ప్రతిసారి ఓటింగ్ శాతం తగ్గుతూ వస్తుండడం గమనార్హం. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో 56.45 శాతం పోలింగ్ జరగ్గా.. 2018లో 52 శాతానికి పడిపోయింది. ఈ దఫా ఎన్నికల్లో ఎలాగైనా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల విషయంలో ఓటర్లు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ఉండేలా స్లిప్పుల పంపిణీ చేపడుతున్నారు. ఆదివారం నాటికి లక్ష పైచిలుకు ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

కీలకంగా బీఎల్‌ఓల పాత్ర..

ఇదే క్రమంలో పోలింగ్ శాతాన్ని పెంచడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకంగా మారనుంది. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్లను గుర్తించడంతో పాటు ఓటర్లు సైతం తమ బీఎల్‌ఓలను గుర్తించేలా ఇప్పటికే వివిధ రూపాల్లో ఓటర్లను బీఎల్‌ఓలను కలుసుకోవడం జరిగింది. నియోజకవర్గంలో 249000 ఓటర్లకు గానూ 229 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కో బీఎల్‌ఓ విధులు నిర్వర్తిస్తుంటాడు. వీరంతా తమకు కేటాయించిన పరిధిలో స్లిప్పుల పంపిణీ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు మొత్తం 22 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఒక్కో బీఎల్‌ఓ పరిధిలో సుమారు 200 నుంచి 300 ఇళ్లు ఉంటాయి.

పోలింగ్ బూత్ వద్ద రద్దీ తెలుసుకునేలా..

పోలింగ్ రోజు బూత్‌లలో క్యూ పరిస్థితి ఎలా ఉంటుందో ఇంటి వద్దనే ఉండి తెలుసుకునే వెసులుబాటును కల్పించారు. ఓటరు స్లిప్పులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ బూత్‌ల వివరాలతో పాటు అక్కడి స్టేటస్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. బూత్‌లలో రద్దీని తెలుసుకుని ఆ మేరకు ఎక్కువ సేపు క్యూలైన్లలో నిలబడకుండా ఓటు హక్కు వినియోగించుకుని వెళ్లొచ్చు.

ఇంట్లోనే వృద్ధులకు ఓటు వేసే అవకాశం..

80 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంట్లోనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రం వద్దకు రాలేని వారిని ముందుగానే గుర్తించే బాధ్యతలను బీఎల్‌ఓలకు అప్పగించారు. ఒకవేళ రాలేని పరిస్థితిలో ఉన్నవారికి ఫాం12–డీ అందజేసి పూరించిన ఫారాన్ని తిరిగి ఎన్నికల సిబ్బందికి అందించాల్సి ఉంటుంది. పోలింగ్ రోజున ఎన్నికల అధికారి, పోలీస్ సిబ్బంది కలిగిన బృందం వృద్ధుల ఇళ్లకు వెళ్లి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయించి తీసుకు వస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీస్తారు.

పోలింగ్ బూత్‌ల వివరాలతో..

ఓటరుకు సంబంధించిన వివరాలతో పాటు సదరు ఓటరు ఎక్కడ ఓటు వేయాలో తెలియజేసే పోలింగ్ బూత్, ఆ బూత్ ఉన్న భవనం వివరాలతో కూడిన స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఇదే క్రమంలో స్లిప్పుల పంపిణీ అనంతరం ఓటరు ఫోన్ నెంబర్‌ను సేకరిస్తున్నారు. ఆయా ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలింగ్ రోజు నాటికి మరింత చైతన్యం తీసుకువచ్చే విధంగా ఎస్‌ఎంఎస్‌ల ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. పోలింగ్ రోజు (ఈ నెల 30) మధ్యాహ్నం 12 గంటల వరకు పోలింగ్ శాతాన్ని పరిశీలించిన పిమ్మట అప్పటివరకు తక్కువ పోలింగ్ శాతం నమోదైనట్లయితే ఎవరైతే ఓటు హక్కు వినియోగించుకో లేదో వారి ఇళ్లకు వెళ్లి ఓటు వేసేలా వారిని పోలింగ్ కేంద్రానికి రప్పించే చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. స్లిప్పుల పంపిణీ సమయంలో రాజకీయ పార్టీ నేతలను కూడా అనుమతిస్తున్నారు. అయితే స్లిప్పులు మాత్రం బీఎల్‌ఓలు మాత్రమే అందించాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఓటర్లను ప్రేరేపించేలా ఎలాంటి చర్యలకు ఉపక్రమించినా చర్యలు ఉంటాయి.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం..



ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఎన్నికల కమిషన్ తరుపున పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశాం. ఆ మేరకు ఓటర్లను చైతన్య పరుస్తున్నాం. శనివారం వరకు 61 వేల మంది ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశాం. ఆదివారం సెలవు దినం కావడంతో ఆ సంఖ్య లక్షన్నర వరకు చేరుకుంటుందని అంచనా.

– కిషన్‌రావు ఆర్‌ఓ

అవకాశమిస్తే సనత్‌నగర్ రూపురేఖలు మార్చేస్తా

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ



బన్సీలాల్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ ప్రజలు ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గం రూపురేఖలు మార్చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నీలిమ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ప్రజా సంక్షేమం, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ పాలన కుంభకోణాలమయమన్నారు. దళిత బంధువు, డబుల్ బెడ్రూమ్‌లతో పాటు అనేక పథకాలు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారాయన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు పేదల జీవితాలను సమూలంగా మార్చుతాయన్నారు. దళితులు, బలహీనవర్గాలు ఎక్కువగా జీవించే బన్సీలాల్‌పేట్‌లో బీఆర్‌ఎస్ పాలనలో వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. బీఆర్‌ఎస్ కుటుంబ పాలనను అంతమొందించి కాంగ్రెస్ ప్రజా పాలనకు శ్రీకారం చుట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాన మంత్రి దివంగత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బోయిగూడలోని ఆమె విగ్రహానికి కోట నీలిమ పూలమాల వేసి నివాళులర్పించారు.

సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ ఖాయం



ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం శాంతినగర్‌లోని ఇందిరానగర్, కట్టెల మండి ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేశామని, సికింద్రాబాద్‌ను అభివృద్ధిలో పథంలో నడుపుతున్నామన్నారు. పదేళ్లలో రూ. కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని మౌలిక వసతులపై దృష్టి సారిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాముఖ్యతను కల్పిస్తూనే సంక్షేమ కార్యక్రమాల్లో సికింద్రాబాద్‌లో అగ్ర భాగంలో నిలిపినట్లు పేర్కొన్నారు. ఈ ప్రచారంలో కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మితో పాటు బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, అమర్, రాజు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్‌తోనే అభివృద్ధి సాధ్యం



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో డబుల్ ఇంజిన్‌తో మరింత అభివృద్ధి సాధ్యమవుతోందని బీజేపీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం ఐదోవార్డు పరిధిలోని వాసవీనగర్, ఒకటో వార్డు సంచారపురి, ఆరోవార్డు పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్, ఏడో వార్డు సాయిబాబా హట్స్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. బోర్డు సభ్యుడు రామకృష్ణకు తోడుగా రాష్ట్ర ప్రతినిధికిగా బీజేపీకే చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. తొమ్మిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఎలాంటి అభివృద్ధి నిధులు కేటాయించ లేదన్నారు. తనను గెలిపిస్తే కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక ప్యాకేజీతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల మాదిరిగా మ్యాచింగ్ ఫండ్స్ ఇచ్చేలా చేస్తానన్నారు. భూబదలాయింపు ద్వారా సాయిబాబా హట్స్‌తో పాటు రక్షణ స్థలాల్లో వెలిసిన బస్తీలకు పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, భానుక నర్మద మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవంత్ సత్తా



ద్వితీయ బహుమతి సాధించిన రేవంత్

చిలకలగూడ: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి పోస్టల్ కన్వెన్షన్ హాల్లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జింఖానా గ్రౌండ్ క్రీడాకారుడు జీఎం రేవంత్ ద్వితీయ బహుమతి సాధించాడు. సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన రేవంత్ 55 కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి స్నాచ్‌లో 70 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 80 కేజీలు ఎత్తి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సీతాఫల్‌మండి సాయివిద్యావికాస్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతున్న రేవంత్ గత కొంతకాలంగా జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అనేక బహుమతులతో పాటు అవార్డులు, రివార్డులు సాధించాడు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. దేశానికి ప్రాతినిధ్యం వహించి, పతకాలు సాధించాలనే లక్ష్యంతో కఠోర సాధన చేస్తున్నట్లు తెలిపాడు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న ఇంటర్నేషనల్ కోచ్ శివకుమార్, హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, కోచ్ రాజు, శ్రవణ్, జింఖానా పవర్ లిఫ్టింగ్ కోచ్ హేమలతకు కృతజ్ఞతలు తెలిపాడు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బంజార వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక హోమం పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నిర్వాహకులు హరిసింగ్, బీఆర్‌ఎస్ నేతలు హనుమంత్‌రావు, ఎం.లలితగోపీచౌహన్, కిషన్‌సింగ్, సంతోష్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం ఆర్‌కే. పురానికి చెందిన అసోజా (52) కారు డ్రైవర్. ఈ నెల 18న డ్యూటీ ముగించుకొని రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. అమ్ముగూడ–మౌలాలి రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన అసోజాను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఆత్మీయ సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్



శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న ఫాదర్లు

సనత్‌నగర్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారని అధికారంలో ఉన్నంతకాలం ప్రజలను ఓటు బ్యాంక్ లాగా చూశారని, వారి సమస్యలను పట్టించుకోలేదన్నారు. 40 ఏళ్లుగా తమకు ఖబ్రస్తాన్ ఏర్పాటు చేయాలని ఇక్కడి ముస్లింలు కోరుతూ వస్తున్నా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి రెండెకరాల భూమి కేటాయించడంతో పాటు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టినట్లు వివరించారు. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో రైల్వే ట్రాక్‌పై నుంచి రాకపోకలు సాగిస్తూ అనేక మంది మరణించినా నాటి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించి ఈ ప్రాంత ప్రజల సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ సలీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసి ఉల్లాఖాన్, తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ ఉప్పల తరుణి, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, నరేందర్, శేఖర్, అఖిల్, అబ్బాస్, సాజిద్ అలీ, వాహిద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపుతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు..

అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేస్తోందని, మళ్లీ బీఆర్‌ఎస్ గెలుపుతోనే ఆ పథకాలు కొనసాగింపు ఉంటుందని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని కోవెల్స్ స్కూల్ గ్రౌండ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంతో పాటు సనత్‌నగర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, గౌడ సంఘం ప్రతినిధులు రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, సరితాగౌడ్ పాల్గొన్నారు.



సంక్షేమం, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం..

బన్సీలాల్‌పేట్: ప్రజా సంక్షేమ, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జీరా, కస్తూర్బానగర్, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి బీఆర్‌ఎస్ పథకాలను చేరాయని నిరంతరం మీకు అందుబాటులో ఉంటూ కష్టాలు కన్నీళ్లలో పాలుపంచుకున్న తనను రానున్న ఎన్నికల్లో ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కల్లబొల్లి మాటలతో ఓటు కోసం వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ గౌడ్‌లతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు..

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం మంత్రికి ఫాదర్లు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు విల్సన్, దయాకర్, సుధీర్, కృపానంద్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాల సంక్షేమం



లోధా అపార్ట్‌మెంట్ నివాసితుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో..

సనత్‌నగర్: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సనత్‌నగర్ లోధా అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోందని బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారన్నారు. తన రాజకీయ జీవితం మొదలైన సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని సమకూరుస్తూ రావడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భవిష్యత్ తరాల దృష్ట్యా అభివృద్ధి పనులను చేశానన్నారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలనలో కమీషన్ల కోసమే అభివృద్ధి పనులు అన్నట్లుగా ఉందన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ పాలకుల అవినీతిని గమనిస్తున్నారని, ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గ సమస్యలపై తనకు పూర్తిస్థాయి అవగాహన ఉందని, గెలిచిన వెంటనే అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్రంలో బీజేపీ విజయంతోనే అన్ని వర్గాల సంక్షేమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్‌గౌడ్, దయానంద్, సురేష్, శ్రీశైలంగౌడ్, చిల్ల శ్రీకాంత్, రాజశేఖర్, నాగేంద్రనాథ్, విపుల్, సతీష్, శ్రీధర్‌రెడ్డి, కూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

బల్కంపేటలో..

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గంలో ఆదివారం బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి కార్పొరేటర్ సరళతో కలిసి ప్రచారం చేశారు. 'బస్తీబస్తీకి బీజేపీ గడప గడపకు కమలం' అనే నినాదంతో బల్కంపేటలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వివరిస్తూ తెలంగాణలోనూ బీజేపీని గెలిస్తేనే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

పద్మారావునగర్: మాజీ ప్రధాన మంత్రి దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలను సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మోండా మార్కెట్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్. విఠల్, డాక్టర్ శివకుమార్ లాల్, నారాయణ, శ్రీనివాస్, సీపీ శంకర్, దానయ్య, దశరథ్, రాము, సురేష్, హేమలత, శ్యామ్, జగదీష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ వెన్నెల ఆదివారం మడ్‌ఫోర్ట్, బాలంరాయిల్లోని సెయింట్ ఆంథోని చర్చి, బాలంరాయి సాపర్స్‌లైన్ చర్చి, సెయింట్‌జోషఫ్ చర్చి బొల్లారం ఇతర చర్చిల్లో క్రైస్తవులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. క్రైస్తవుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని వచ్చే ఎన్నికల్లో చేయి గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఫాదర్లు, పాస్టర్లు వెన్నెలను ఆశీర్వదించి ఆమె గెలుపు కోసం ప్రార్థనలు చేశారు.



వెన్నెలను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

పేదలకు పథకాలను అందించే పార్టీ బీఆర్‌ఎస్



ప్రచారం చేస్తున్న లాస్యనందిత

రసూల్‌పురా: పేదలకు సొంతిల్లు ఉండాలని తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న సిల్వర్‌కాంపౌండ్, నారాయణ జోపిడీ సంఘం బస్తీల్లో డబుల్ బెడ్రూమ్ కట్టించారని బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత పేర్కొన్నారు. ఆదివారం రెండవ వార్డు రసూల్‌పురాలోని పలు బస్తీల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిల్వర్‌కాంపౌండ్ వద్ద 224 మంది పేదలకు నారాయణ జోపిడీ సంఘం వద్ద మూడు వందలకు పైగా పేదల ఇళ్ల కోసం సాయన్న విశేషంగా కృషి చేశారని అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలు బస్తీవాసులు లాస్యనందితకు ఓటు వేసి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో గజ్జెల నాగేష్, నివేదిత, డీడీ. దేవేందర్, ముజాయిద్ ఖాన్, ముక్రం, కుమార్, అంజనేయులు, శ్రీనివాస్, మోయిస్, నుమాన్, వాహాబ్ పాల్గొన్నారు.

- బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ ఆధ్వర్యంలో మూడవ వార్డు పరిధిలోని గాంధీనగర్, మడ్‌ఫోర్ట్ శ్రీరాంనగర్, అంబేడ్కర్‌నగర్, కట్టకింది బస్తీల్లో లాస్యనందితకు మద్దతుగా ఆమె సోదరి నివేదిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓడిపోతామనే భయంతో బీజేపీ నాయకులు చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని అనితా ప్రభాకర్ విమర్శించారు.

పనిచేసే వారిని మళ్లీ గెలిపించుకుందాం

సనత్‌నగర్: నిత్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపించే నాయకులను వదులుకోవడం వివేకం కాదని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మద్దతుగా ఆదివారం ఆమె స్థానిక నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకునే మాధవరం కృష్ణారావును గెలిపించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. గత 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ నేతలు పరిష్కరించలేని సమస్యలను కూడా తొమ్మిదిన్నర ఏళ్లలో పరిష్కరించడం జరిగిందన్నారు. మాధవరం గెలుపుతోనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేసేలా రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ముల్కల భాస్కర్

రాంగోపాల్‌పేట్: క్రైస్తవులు, పాస్టర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా, తమ విజ్ఞతతో నచ్చిన పార్టీకి ఓటేసేలా రక్షణ కల్పించాలని భారత క్రిష్టియన్ కౌన్సిల్ పొలిటికల్ విభాగం చైర్మన్ బిషప్ ముల్కల భాస్కర్ విన్నవించారు. ఆదివారం రెజిమెంటల్‌బజార్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంత మంది క్రైస్తవ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరి తనకు అనుకూలంగా ఉన్న కొందరు పాస్టర్లు, డినామినేషన్లకు చెందిన వారిని బెదిరించి ఆయా సంఘాలకు చెందిన ఓట్లు ఆ పార్టీకి వేయించేందుకు ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపించారు. ఆదివారం చర్చి మధ్యలో ప్రార్థనలు చేయిస్తూ వీడియోలు పంపించాలని లేకుంటే రాబోయే తమ ప్రభుత్వంలో మీ అంతు చూస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. నకిలీ క్రిష్టియన్ డిక్లరేషన్ కాపీలను చూపించి డబ్బు ఎరవేసి ప్రలోభాలకు గురిచేస్తున్నారని వెంటనే ఎన్నికల కమిషన్, పోలీసులు స్పందించి పాస్టర్లు, క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జోసఫ్ బాబు, జాన్ విజయ్, జెరుషలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.